# బాలభారతి

ఏప్రిల్ -1991





# భార్యసలహా

వేమయ్య మహాబద్ధకస్తుడు. అతనికి ఓ చిన్న యిల్లు తప్ప మరే ఆస్తిలేదు. సమీపంలో వున్న అడవి నుంచి పళ్ళు కోసుకొచ్చి, వూళ్లో అమ్మి, ఆ వచ్చిన డబ్బుతో బ్రతుకుతున్నాడు. పళ్ళగంప నెత్తుకుని వీథుల్లో ఎక్కువ సేపు తిరగటానికి బద్ధకించి, ఎవరో ఒకరికి యెంతో కొంతకు అమ్మేసి, చప్పున యింటికి చేరేవాడు. చాలకపోతే అతని భార్య అన్నపూర్ణ కాస్త తెలివైంది కనుక గుట్టుగా కాపురాన్ని నెట్టుకొస్తోంది.

ఇలా వుండగా ఒకనాడు ఉస్సురంటూ యింటికి తిరిగి వస్తున్న వేమయ్యకు, వారి యింటి ప్రక్కనే వున్న మర్రిచెట్టులో వుంటున్న ఒక దయ్యం ఎదురుపడింది. దాన్ని చూస్తూనే అతనికి ఒళ్ళంతా చెమటలు పట్టాయి. నాలుక తడారిపోయింది.

అయితే దయ్యం అతనికి ధైర్యం చెబుతూ, 'చూడు వేమయ్యా! మీ బాధల్ని నేను చూస్తూనే వున్నాను. నేటితో నా దయ్యం జీవితం ముగియబోతుంది. వెళ్ళేముందు నీకు మేలు చేయాలనుకుంటున్నాను. నీకు వరహాల బిందె నిస్తున్నాను. పది మందికీ ఉపయోగపడేలా జీవిస్తూ బ్రతుకు. మాట తప్పావో తిరిగి దరిద్రుడవవుతావు' అని హెచ్చరించి బిందె నిచ్చి మాయమైంది.

వేమయ్య ఆశ్చర్యంతో తలమునకలవుతూ వరహాల బిందెతో వేగంగా యింట్లో ప్రవేశించాడు. జరిగినదంతా భార్యకు చెప్పి, గబగబా నట్టింట్లో త్రవ్వి, ఆ బిందెను పూడ్చిపెట్టాడు.

ఆ తర్వాత దంపతుల మధ్య తమ భావి జీవితాన్ని గురించి వాగ్వివాదం బయల్దేరింది.

'పది మందికీ ఉపయోగపడేలా జీవించమని దయ్యం చెప్పిందన్నారుగదా! మనం ఒక భోజనశాలను ప్రారంభిద్దాం. బాటసారులకు కడుపారా అన్నం పెడుతూ వారంతా తృప్తిగా త్రేన్చి వెళ్ళిపోతుంటే సంతోషిద్దాం. వూరికే పెట్టవద్దు. నామమాత్రంగా వారి వద్ద

‘ఈ బొమ్మకు కథ వ్రాయండి’ (ఫిబ్రవరి '91) పోటీలో 50 రూ.లు బహుమతి పొందిన కథ

డబ్బు తీసుకుందాంలెండి' అన్నది అన్నపూర్ణ.

కానీ వేమయ్య అందుకు ఒప్పుకోకుండా 'నీ బోడి సలహాల్ని నేను వినదలచుకోలేదు - నువ్వు చెప్పినట్లుగా చిల్లర డబ్బులు తీసుకుని అడ్డమైన వారికీ వండిపెట్టటానికి నేను వెర్రి వాడ్ని కాదు. అదీగాక ఇకపై నేను కష్టపడ దలచుకోలేదు. తరతరాలకూ తిని కూర్చున్నా సరిపోతుంది ఈ వరహాల బిందె! మనం ఈ ధనాన్ని ఏం చేసినా ఆ దయ్యానికి ఏం తెలిసి చస్తుంది గనుక!' అంటూ నిర్లక్ష్యంగా భార్యపై ఎగిరిపడ్డాడు. భర్త మూర్ఖతకు నొచ్చుకుంటూ మౌనం వహించింది అన్నపూర్ణ.

కమ్మని వూహలతో వారం రోజులు ఓపిక పట్టిన వేమయ్య ఆ తర్వాత రోజున, 'సంత కెళ్ళి నీకు చీరెలూ, నాకు బట్టలూ యింట్లోకి కావలసినవీ అన్నీ పట్టుకొస్తాను. రెండు కోడి పెట్టల్నీ - పెద్దపెద్ద రొయ్యల్నీ తెచ్చేస్తాను. అద్భుతంగా వండాలి నువ్వు' అంటూ భార్యకు చెప్పి, డబ్బుకోసం నట్టింట్లో పాతిపెట్టిన బిందెను పైకి తీసాడు.

అంతే! .అందులో వరహాలకు బదులుగా మట్టి వుండటంతో వేమయ్య ఘొల్లుమన్నాడు.

అంతలో దయ్యం అక్కడ ప్రత్యక్షమై, 'నీ బుద్ధి తెలుసుకోవటం కోసమే నా దయ్యం జీవితం ముగిసిందని అబద్ధం చెప్పాను. ఉత్తమ సాధ్వి, తెలివైనదీ అయిన నా భార్య సలహాల్ని పాటించకుండా పాపకార్యాలు చేసి యిలా దయ్యమైన నాకు విముక్తి కూడానా?... ఇంకెంత కాలం గడపాలో! ... నువ్వూ నీ భార్య సలహా వినకుండా నీ నోట్లో మట్టి కొట్టుకున్నావు. వరహాల్ని మట్టిగా మార్చింది నేనే!' అంటూ మాయమైపోయింది.

మంచి మాట చెప్పిన భార్యను తృణీక రించిన ఫలితాన్ని అనుభవిస్తూ వేమయ్యకు తిరిగి పళ్ళకోసం గంపతో అడవికి బయల్దేర వలసిన దుర్గతి పట్టింది!

—ప్రతాప వెంకట సుబ్బారాయుడు,
సికింద్రాబాదు.

